

మంథని : మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



ధర్మారం : మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సుల్తానాబాద్ రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు




కోల్‌సిటీ : మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్

# గ్రామ సభలు.. గందరగోళం

- జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజల ఆగ్రహం
- ఎక్కడికక్కడ అధికారుల నిలదీత
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్

*రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న నాలుగు కొత్త పథకాల కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో గందరగోళం నెలకొన్నది. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ అధికారులను నిలదీశారు. అలాగే ₹2లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తరు? రైతుభరోసా ఇంకెప్పుడు ఇస్తారంటూ.. రైతులు నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేసి.. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.*



కమాన్‌పూర్: పెంచికల్ పేటలో ప్రజాపాలన సభలో పోలీసుల బందోబస్తు

మంథని, జనవరి 21: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు. మంథని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 11, 12,13 వార్డులకు సంబంధించి వార్డు సభ మంగళవారం నిర్వహించారు. జాబితాలో పేరు రాని వారు దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ సూచించారు. కమిషనర్ మనోహర్ లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేశ్ రెడ్డి, ఆర్డీవో సురేశ్, డీటీ గిరి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన గ్రామ సభలు..

మంథని మండలం నాగారం, పోతారం, సూరయ్యపల్లి, పుట్టపాక, అక్కెపల్లి, నగరంపల్లి, గోపాల్‌పూర్‌లో గ్రామసభలు నిర్వహించారు.

## నిబంధనలు సడలించాలని కోరుతా

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్

ధర్మారం,జనవరి21:ధర్మపురి నియోజక వర్గంలోనే ఇందిరమ్మ ఇండ్లను అధికంగా నంది మేడారం గ్రామానికి కేటాయిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మండలంలోని పత్తిపాక, నాయకంపల్లి, బొమ్మారెడ్డిపల్లి, కటికెనపల్లి, కొత్తూరు, సాయంపేట, కానంపల్లి, నంది మేడారం, పైడిచింతలపల్లిలో ప్రజాపాలన సభలు జరిగాయి. నంది మేడారంలో జరిగిన గ్రామసభకు విప్ హాజరయ్యారు. నియోజక వర్గానికి 3,500 ఇండ్లు ఇందిరమ్మ పథకంలో ప్రభుత్వం కేటాయించదని విప్ తెలిపారు. నిరుపేదలు అధికంగా ఉన్న నంది మేడారానికి ఎక్కువ సంఖ్యలో ఇండ్లు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఆత్మీయ పథకంలో నిబంధనలు సడలించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానని తెలిపారు.

**కమ్మర్‌ఖాన్‌పేటలో గ్రామస్తుల నిరసన**

అర్హులకు పథకాలు రాలేదని, అలాంటప్పుడు భలు ఎందుకని కమ్మర్‌ఖాన్‌పేట గ్రామస్తులు ప్రజాపాలన సభలో అధికారులను నిలదీశారు. అధికారులు ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేదల పేర్లు లేవని, ఇండ్లు ఉన్నవారినే ఎంపిక చేశారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో తమ పేర్లు లేవని పలువురు ఉపాధి కూలీలు అధికారులను ప్రశ్నించారు.

## అర్హులందరికీ పథకాలు

సుల్తానాబాద్/ సుల్తానాబాద్ రూరల్, జనవరి 21 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. గొల్లపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే విజయ రమణరావు హాజరయ్యారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని 1, 2, 3, 4, 8, 9, 10, 11వ వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు సభలకు హాజరయ్యారు. పదో వార్డులో కొంతమంది అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో స్థానిక నాయకుడు తుమ్మ రాజ్‌కు మార్, కామని రాజేందర్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వార్డు సభల్లో దరఖాస్తుల వెల్లువ..

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్/పెద్దపల్లి రూరల్, జనవరి 21: ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో 5737 మంది ఇందిరమ్మ ఇండ్లకు అర్హులని, అందులో స్థలం ఉన్న వారు 2133, స్థలం లేని వారు 3604 మంది, కొత్త రేషన్ కార్డులకు 702 మంది అర్హులని ప్రభుత్వం జాబితాను పంపించదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియని, అర్హుల జాబితాలో పేర్లు రాని దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన ప్రజాపాలన వార్డు సభలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి.

## ఇంకెన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి?

పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి, బొంపల్లి, కాసులపల్లి, పాలితం, కొత్తపల్లి, మూలసాల, చీకురాయి, రాపల్లి, హన్మంతునిపేట,సబ్బితంలో ప్రజాపాలన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పన్నపేట, పాలితం గ్రామసభలకు పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి బీ గంగయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్‌అలీ, ఏపీవో రమేశ్ బాబు, ఏపీడీ సత్యానారాయణ, ఏఈ రవీంద్రనాథ్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రసాభాసగా సభలు

ఓదెల, జనవరి 21: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో పథకాలపై స్పష్టత లేదని ప్రజలు అధికారులను నిలదీశారు. భీమరపల్లి గ్రామసభకు జడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి నరేందర్ హాజరయ్యారు. ఈ సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో నిరుపేద కూలీలు అర్హులు కాగా, భూములు ఉన్న వారి పేర్లు ఎలా వచ్చాయని నిలదీశారు. ఈ జాబితా ఇంకా ఫైనల్ కాలేదని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని అధికారులు సూచించారు. రేషన్ కార్డుల కోసం చాలా సార్లు దరఖాస్తులు చేసుకున్న తమ పేర్లు రాలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు సమాధానం ఇచ్చారు. మంగళవారం భీమరిపల్లి, కొమిరె, గుండ్లపల్లి, రూపునారాయణపేట, బాయమ్మపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో సభలు జరిగాయి. తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి, డీటీ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, ఏవో భాస్కర్, ఎంపీవో షబ్బీర్ అలీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో ఉద్రిక్తత

జూలపల్లి, జనవరి 21 : నాగులపల్లి, చీమలపేట, తేలుకుంట, కాచాపూర్, అబ్బాపూర్‌లో మంగళవారం 'ప్రజా పాలన' గ్రామ సభలు నిర్వహించారు. అబ్బాపూర్‌లో అధికారులు అర్హుల జాబితా చదవుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త రేషన్ కార్డులు ఎలా మంజూరు చేస్తారని నిలదీశారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకున్నది. తమకు వ్యవసాయ భూములు లేవనీ, ఉపాధి పథకం కింద 20 రోజులు దాటి కూలీ పనులు చేసినా ఎందుకు ఎంపిక చేయలేదని మహిళలు మండిపడ్డారు. కొద్దిసేపటి తర్వాత అధికారులు అక్కడి నుంచి నిష్క్రమించారు. నాగులపల్లి, చీమలపేట, తేలుకుంటలో నిర్వహించిన సభలకు ఎమ్మెల్యే విజయరమణారావు, చీమలపేటలో కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరయ్యారు. వేర్వేరు కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శంకర్, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఏవో ప్రత్యూష, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

## కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, జనవరి21: పెగడపల్లి, కూనారం, ఇద్లాపూర్, పందిల్ల, కిష్టంపేట, ఆశన్నపల్లె, ఆరెపల్లె, తారుపల్లిలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేవని పలు గ్రామాల్లో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కూనారంలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో తమ పేర్లు ఎందుకు రాలేదని పందిల్ల గ్రామానికి చెందిన దాసరి శ్యామల, చిలుముల పుష్పలత, పలువురు మహిళలు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వకీల్, మండల ప్రత్యేకాధికారి శ్రీమాల, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఏవో నాగార్జున, ఏపీవో మంజుల, ఎస్‌ఐ వెంకటేశ్, ఎంపీవో కిరణ్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## ఎలిగేడులో..

ఎలిగేడు, జనవరి 21: మండలంలోని లోకపేట, బుర్హాన్‌మియాపేట, లాలపల్లె, నారాయణపల్లెలో ప్రజాపాలన సభలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## 9 గ్రామాల్లో గ్రామసభలు

పాలకుర్తి, జనవరి21: మండలంలోని ఎల్కలపల్లి, గుడిపల్లి, గుంటూర్‌పల్లి, కొత్తపల్లి, మారేడుపల్లి, రామారావుపల్లి, ఉండెడ, వేంనూర్, ఎల్కలపల్లి గేట్‌లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఏడాదికాలంగా ఎన్నోసార్లు దరఖాస్తులు ఇచ్చామని, మళ్లీ దరఖాస్తులు ఇవ్వమనడం సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 9 గ్రామాల్లో సుమారు 1287 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## తహసీల్దార్ నిలదీత

అంతర్గాం, జనవరి 21: అంతర్గాం మండలంలో నిర్వహించిన గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. ఆకెనపల్లి, సోమనపల్లి, గోలివాడ, విస్సంపేట, టీటీఎస్ అంతర్గాం, ముద్దిర్యాల తదితర గ్రామాల్లో తహసీల్దార్ తూము రవీందర్ సభలను ప్రారంభించారు. అంతర్గాం టీటీఎస్‌లో తహసీల్దార్‌ను రవీందర్‌ను గ్రామస్తులు నిలదీశారు. పేదవారిని గాకుండా ఉన్న వాళ్లనే ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేశారంటూ వాగ్వాదానికి దిగారు.

## మళ్లీ దరఖాస్తు చేసుకోండి

రామగిరి, జనవరి 21: పన్నూరు, జల్లారం, సుందిళ్ల, బుధవారంపేట, రాజాపూర్, రత్నాపూర్‌లో గ్రామ సభలు నిర్వహించారు. వివిద పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఎంపీడీవో శైలజా రాణి చదివి వినిపించారు. సభల్లో మండల ప్రత్యేక అధికారి రమేశ్, తహసీల్దార్ రాంచందర్ రావు, ఎంపీవో ఉమేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

జ్యోతినగర్, జనవరి 21: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకటో డివిజన్ విలేజ్ రామగుండం, 21వ డివిజన్ రామగుండంలోని జడ్పీహెచ్‌ఎస్, 22వ డివిజన్ అయోధ్యనగర్, 2వ డివిజన్ ఎన్టీపీసీ పట్టణం పీకే రామయ్యకాలనీలో సభలు జరిగాయి. అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్పొరేటర్లు రమణారెడ్డి, కౌశికలత, అధికారులు ఉన్నారు.

## అనర్హులను ఎంపిక చేశారని..

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 21: ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, ఎఫ్‌సీగేట్‌లో సభలు నిర్వహించారు. ఎల్కలపల్లిలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో చదివి వినిపించగా సగం మంది అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. దీంతో అక్కడ వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి గొడవ సద్దుమణిగించారు. .

## పోలీసుల పహారా మధ్య

కమాన్‌పూర్, జనవరి 21: మండలంలోని నాగారం, సిద్దిపల్లె, పెంచికల్‌పేటలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోలీసుల బందోబస్తు, పహారా మధ్య సభలు జరిగాయి. అర్హుల పేర్లు కూడా జాబితాలో లేవంటూ ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రశ్నించారు.

## విద్యాబోధనకు అంతరాయం

జ్యోతినగర్(రామగుండం), జనవరి 21: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 1, 21వ డివిజన్లలో నిర్వహించిన వార్డు సభలతో పాఠశాలల్లో విద్యబోధనకు అంతరాయం కలిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకటో డివిజన్ విలేజ్ రామగుండంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించి సభతో ఉపాధ్యాయులు తరగతి గదులకు తలుపులు మూసి విద్యాబోధన చేశారు. బయట సభలో మైక్‌లో అధికారులు, జాబితాలో పేర్లులేని వారి మాటలతో విద్యాబోధనకు అంతరాయం కలిగింది. రామగుండంలోని 21వ డివిజన్ జడ్పీహెచ్‌ఎస్‌లో కూడా కొంత సేపు విద్యబోధనకు ఆటంకం ఏర్పడింది.

### నాకు గుంట భూమిలేదు



నేను నిరుపేదను. నా భర్త పదేండ్ల కింద చనిపోయిండు. వంద రోజుల పనికి రోజు పోతున్న. ఉండడానికి ఇల్లు కూడా లేదు. కిరాయి ఇంట్ల ఉండి కైకిలి చేసుకుని బతుకుతున్న. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం జాబితాలో నా పేరు రాలేదు. నాకంటే గరీబులు ఈ ఊళ్లో ఎవ్వరు లేరు. నా పేరెందుకు లిస్ట్‌లో రాలేదు. అధికారులు స్పందించి నా పేరును ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో చేర్చాలి.

**దాసరి శ్యామల, పందిల్ల (కాల్వశ్రీరాంపూర్)**

### దరఖాస్తు చేసినా సర్వే చేయలే



నాపేరు పల్లికొండ గంగ జమున. నందిమేడారంలోని 11వ వార్డులో నివా సం ఉంటున్న. మాది పూరి గుడిసే. ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులకు దరఖా స్తులు ఇచ్చిన. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకు సర్వే చేశారు. కానీ సర్వేకు అధికా రులు మా ఇంటికి రాలేదు. నాపేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో లేదు. నాకు న్యాయం చేయాలి. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్న.

**పల్లికొండ గంగ జమున, నంది మేడారం (ధర్మారం)**

## వార్డు సభల్లో 'హస్తం' నేతల హవా...

కోల్‌సిటీ, జనవరి 21: అంతా అనుకున్నట్టే వార్డు సభలు మళ్లీ కాంగ్రెస్ సభలుగానే మారిపోయాయి. మంగళవారం రామగుండంలోని 31వ డివిజన్‌లో జరిగిన సభకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, మేయర్ అనిల్‌కుమార్ హాజరయ్యారు . వేదికపై కార్పొరేటర్లతో పాటు పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు సైతం కూర్చొవడం విమర్శలకు తావిచ్చింది. అధికారిక సభల్లో కాంగ్రెస్ కార్పొరేటర్ల భర్తలు, ఆ పార్టీ కార్యకర్తలు వేదికపై కూర్చోవడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలన సభలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 35వేల దరఖాస్తులు వచ్చాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయగా 28,539 మంది పక్కా ఇళ్లు లేనివారిగా గుర్తించినట్లు జాబితాను ప్రకటించారు. ఇందులో 1790 సొంత స్థలం కలిగి ఉండగా 26,749 మందికి సొంత స్థలం లేదని గుర్తించారు. ఐతే తొలిరోజు సభలు మొక్కుబడిగానే సాగాయి. ఎక్కువ శాతం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసమే మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేసుకోవడం కనిపించింది.

### మళ్లీ దరఖాస్తులు

ప్రజాపాలన సభల్లో వివిధ సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తుల వెల్లువెత్తాయి. తొలి రోజు ముందుగా నిర్దేశించిన ఆయా డివిజన్లలో నిర్వహించిన సభలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు, మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ హాజరయ్యారు. 1,2,6,7,11, 12, 16, 17, 21, 22, 26, 27, 31, 32, 36, 37, 41, 42, 46, 47 డివిజన్లలో సభలు నిర్వహించారు. 31, 27 డివిజన్లలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మేయర్ హాజరయ్యారు. అర్హుల జాబితాలో పేర్లు లేని వాళ్లు తెల్ల కాగితంపై వివరాలు రాసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. కాగా, బుధవారం 3,4,8,9,13, 14, 18, 19, 23, 24, 28, 29, 33, 34, 38, 39, 43, 44, 48, 49 డివిజన్లలో సభలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

### సభలో కాంగ్రెస్ నేతల పెత్తనం ఏంటి..?

ప్రజా పాలన వార్డు సభలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పెత్తనం ఏమిటని 28వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు జరిగే ఆస్కారం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. 31వ డివిజన్‌లో అదనపు కలెక్టర్ హాజరైన సభలో కార్పొరేటర్ భర్త, కాంగ్రెస్ నాయకులు దర్జాగా కూర్చోవడం అసహనం వ్యక్తం చేశారు. ఏడాది క్రితం ప్రజాపాలన వార్డు సభలో కూడా పెత్తనమంతా కాంగ్రెస్ కార్పొరేటర్లకు ఇవ్వడంతో వారు తీసుకున్న దరఖాస్తులు సకాలంలో మున్సిపల్ కార్యాలయంలో అప్పగించలేదని ఆరోపించారు. దీంతో అర్హులు పథకాలకు దూరమై ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. అధికారికంగా జరిగే వార్డు సభల్లో అర్హత లేని కాంగ్రెస్ కార్యకర్తలను వేదిక మీదకు పిలవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

### తూతూ మంత్రగా..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21 : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 16,17వ డివిజన్‌లలో సభలు తూతూ మంత్రంగా జరిగాయి. 16వ డివిజన్‌కు చెందిన 250మంది గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 35మందిని మాత్రమే ఎంపిక చేశారు. 17వ డివిజన్‌లో 200 మందికిపైగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా 141మంది, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇంటి స్థలం ఉన్న వారికి 13మంది, ఇంటి స్థలం లేని 457మందిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

**పేదలపై పట్టింపు లేని ప్రభుత్వం**

పేదల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని 16వ డివిజన్ కార్పొరేటర్ మందల కిషన్ రెడ్డి అన్నారు. ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా తెల్లకాగితంపై రాసి ఇవ్వాలని అధికారులు చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలను మభ్య పెట్టాడానికే ప్రజాపాలన సభలు నిర్వహిస్తున్నదని విమర్శించారు.



యైటింక్లయిన్ కాలనీ : 17వ డివిజన్‌లో ఖాళీగా ఉన్న కుర్చీలు



జ్యోతినగర్(రామగుండం): విలేజ్ రామగుండం సభలో ప్రజలు



పెద్దపల్లి : దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు

## ఓసీపీ-2 గని సందర్శన

రామగిరి, జనవరి 21ఆర్జీ–3 ఓసీపీ–2 ఉపరితల గనిని డైరెక్టర్ (ఈఅండ్ఎం) డీ సత్యనారాయణ రావు మంగళవారం సందర్శించారు. ముందుగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నరు. అనంతరం వ్యూ పాయింట్ నుంచి పనులు పరిశీలించారు. నిర్దేశించిన ఉత్ప త్తి లక్ష్య సాధనలో భాగంగా యంత్రాల వినియోగంతోపాటు రూపొందించిన ఇతర ప్రణాళికలు, తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు డైరెక్టర్‌కు వివరించారు. ఇంజినీర్ విజయ శేఖర్‌బాబు, ఎస్‌వో టూ జీఎం జీ రఘుపతి, పీవో వెంకటరమణ, ఇంజినీర్ చంద్రశేఖర్, మేనేజర్ రామారావు, ఎస్టేట్ అధికారి ఐలయ్య,అడిషనల్ మేనేజర్ కోల శ్రీనివాస్, సర్వే అధికారులు ఉన్నారు.



గని మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

## డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 21: ప్రయాణికులను తరలించే టాటా మ్యాజిక్ డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రంగారావు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో ఏరియాలోని టాటా మ్యాజిక్ డ్రైవర్లు, స్కూల్‌బస్సు డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పకుండా పాటించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్టీవో మున్సిపల్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కళాకారుల సాంస్కృతిక బృందం అవగాహన కల్పించింది. ఇక్కడ రామగుండం ఎంవీఐ సంతోష్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్‌ఐ హరిశేఖర్, అసిస్టెంట్ ఎంవీఐలు ఉన్నారు.

## ఆర్జీ-2లో క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సిలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21 : సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఎస్‌వో టూ జీఎం ఎం రాముడు అధ్యక్షతన మంగళవారం క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆర్జీ–3 ఏరియాలోని ఏఎల్‌పీ, ఓసీపీ–2, ఆర్జీ–3 జీఎం ఆఫీస్‌లో పని చేస్తున్న ఉద్యోగుల కోసం యాజమాన్యం కౌన్సిలింగ్ నిర్వహించింది. ఇందులో 969మంది దరఖాస్తు చేసుకోగా 136 మంది ఉద్యోగులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. 44 మంది ఉద్యోగులు క్వార్టర్లు తీసుకున్నారు. ఇక్కడ గుర్తింపు సంఘం కార్యదర్శి జీ రవీందర్, అధికార ప్రతినిధి ఎస్ అనిల్ కుమార్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వేణుగోపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలి



కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21: ఆర్జీ–2 ఏరియాలోని మహాకవి పోతన కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని టీబీజీకేఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ యాజమాన్యాన్ని కోరారు. పోతన కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో కార్మిక కుటుంబాల సౌకర్యార్థం పోతన కాలనీలో అధునాతన కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం యాజమాన్యంతో మాట్లాడి ఒప్పించామని గుర్తు చేశారు. ఆయన వెంట కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు చెరుకు ప్రభాకర్ రెడ్డి, బేతి చంద్రయ్య ఉన్నారు.

## యువతి వివాహానికి చేయూత



సాయం అందిస్తున్న వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు

కోల్‌సిటీ, జనవరి 21: గోదావరిఖని వినోబానగర్‌కు చెందిన నిరపేద ముస్లిం యువతికి వివాహం నిశ్చయం కాగా, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీశ్ రెడ్డి చేయూత అందించారు. తన ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు పంపించారు. మంగళవారం నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యురాలు తస్నీమ్ భాను, ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు షేక్ హాజీ అలీ, డివిజన్ అధ్యక్షుడు కొండ సురేశ్ సాయం అందజేశారు. యువతి తండ్రి గతంలో చనిపోగా, తల్లి పక్షవాతంతో బాధపడుతున్నది. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకొని సాయం అందించిన హరీశ్ రెడ్డికి స్థానికులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పోయిల రవి, పొలాడి శ్రీనివాస రావు, హుస్సేన్, మున్వర్, వంశీకృష్ణ, షఫీఖాన్, ఫారూఖ్ ఉన్నారు.